# మారని కథ

సీతకి పెళ్ళి! శుభలేఖ చూసి చకితురాలినయ్యాను! ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి సీతకి పెళ్ళి! ఆనందంతోపాటు ఆశ్చర్యమూ కలిగింది.

నలుపు- పొట్టి, మెల్లకన్ను, ఎత్తుపళ్ళు- అన్నింటికంటె ముఖ్యంగా ఓదరికం - ఇవన్నీ కలిసి సీతని ముప్ఫయి ఏడేళ్ళు నిండినా కన్యగానే మిగిల్చాయి! సీతకి యింక పెళ్ళి కాదని అందరితోపాటు సీత నిశ్చయించుకుంది. ఆ తండ్రి కన్నందుకు మూడు ముళ్ళు వేయించే బాధ్యత తీర్చుకోలేకపోయిన నేరానికి పరిహారార్ధంగా బి యిడీ. చెప్పించి పంతులమ్మ ఉద్యోగం వేయించి సీత బతుకుతెరువుకి లోటులేకుండా చేసి దాటిపోయాడు.

ఆ వున్న తండ్రి ఒకడూ పోయాక - వంటరిగా గదిలో ఉడకేసుకుంటూ, పిల్లలకి పాఠాలు చెప్పుకుంటూ నిర్లిప్తంగా రోజులు వెళ్ళదీసే సీత చీకటి బ్రతుకులో హఠాత్తుగా మళ్ళీ వెన్నెల కురుస్తుందని ఎన్నడూ ఆశించని నాకు సీత పెళ్ళి శుభలేఖ ఎంత ఆనందాన్నిచ్చిందో!

పెళ్ళికి వెళ్ళాలి! ఏభై మైళ్ళ దూరంలో వుండి వెళ్ళకపోడే సీత నన్ను క్షమించదు. ---

--- పెళ్ళికూతురు ముస్తాబుతో సీతకి కూడా కళ వచ్చింది! నన్ను చూసి పలకరింపుగా నవ్వింది.

పెళ్ళికొడుకు ఏ ఏభై ఏళ్ళవాడో, రెండో పెళ్ళివాడో, అనాకారీ అని ఊహించుకున్న నా ఊహలన్నీ - స్నాతకంలో పెళ్ళికొడుకుని చూడగానే తలకిందులయ్యాయి - అతనికి మహావుంటే నలభై వుండచ్చు సీత పదహారేళ్ళ బాలాకుమారి కాదు కనక ఈడు జోడు సరిపోయింది. అక్క

దక్కడ నాలుగు నెరిసిన తలవెంట్రుకలు కనిపిస్తున్నా పచ్చగా మెరిసిపోతూ మంచి పడ్డూ పొడుగూ పెర్సనాలిటీ. కనుముక్కు తీరు అన్నీ వున్న అతను సీతని ఎలా చేసుకుంటున్నాడనిపించింది ?! రెండో పెళ్లి అంటే కాదు ఉద్యోగమూ సీత స్కూలులోనే మాష్టరు ఉద్యోగం. అన్నీ వున్న అతను సీతని చేసుకోడానికే ఈ నలభై ఏళ్ళు అనామకుడిగా వున్నాడా అన్పించింది !

ఆ క్షణంలో ఆనందంకంటె ఆశ్చర్యం, అదేదో తెల్సుకోవాలన్న ఆరాటం నన్ను నిలవనీయలేదు.

లోపల గదిలో సీత వంటరిగావున్న సమయంచూసి దగ్గిర చేరాను. నే అడగబోయే ప్రశ్న, నా ఆరాటం, ఆశ్చర్యం అన్నీ మొహంమీదే కన్పించాయి గాబోలు. "ఏం, ఈ సీతని, ఈ కోతి మొహాన్ని అతనెలా చేసుకుంటున్నాడా అని ఆశ్చర్యపోతున్నావా !" అంది అదోలా నవ్వి.

"అదికాదు - అదికాదు...." తడబడ్డాను. ఎంత స్నేహితురాలైనా ఆ మాట ఎలా అనగలను ?

"ఎందుకే అలా తడబడ్తావు - నేనేం అనుకోనులే. నే నెంత అందగత్తెనో నాకు తెలియదా ఏమిటి ?

"మరి.... మరి అతనెలా వప్పుకున్నాడు - రెండో పెళ్ళి కాదు. బాగున్నాడు, ఉద్యోగస్థుడు - యిష్టపడ్డాడు .... " అడగలేకే అడిగాను. సీత అదోలా నవ్వింది.

"అన్నీ వున్నాయి. అసలుది లేదు గనక చేసుకుంటున్నాడు - " హేళనగా అంది.

"అంటే....?" తెల్లబోయాను' సీత మొహం అదోలా మారింది. నా వైపు సూటిగా చూస్తూ "ఇంకా విడమర్చి చెప్పాలా - నా కాబోయే మొగుడు మొగాడుకాదు" అంది కుండబద్దలు కొట్టినట్టు.

అదిరిపోయాను. "సీతా" అన్నాను తెల్లపోతూ - "అయితే యీ పెళ్లెందుకే - ?"

సీత కసిగా పెదాలు బిగించి "ఎందుకా – నా కిష్టమైన వెధవలతో పడుకోడానికి, యిష్టంలేని వెధవలని నా మంగళ సూత్రాల లైసెన్సు బిళ్ళలు చూపి భయపెట్టడానికి" తెగేసి పొగరుగా అంది.

"సీతా!" దిమ్మెరపోయాను. "మతిపోయిందా, ఏమిటా మాటలు! యిష్టమైన వాళ్ళతో పడుకోడానికయితే! యీ పెళ్ళెందుకే? అలాగే పడుకో బోయావా?" కాస్త కోపంగా అన్నాను.

"ఎందుకా? ఏ వెధవవల్లో కడుపువస్తే నా బిడ్డకి తండ్రి అని చెప్పు కోడానికి ఒకడుండాలిగదా. అడ్డమైన ప్రతివెధవా నన్ను కోరకుండా ఈ లైసెన్సు బిళ్ళలు కట్టించుకుంటున్నాను. పతిత, కులట బిరుదులు రాకుండా యీ మంగళసూత్రం రక్షిస్తుంది – నా బిడ్డకి సరి అయిన స్థానం యీ సంఘంలో లభించడానికే యీ పెళ్ళి." వికటంగా నవ్వి నా బుజం చరిచింది సీత.

దాని ధోరణిచూస్తే దానికే పిచ్చి ఎత్తిందో, నాకే మతిపోయిందో అర్థంకాలేదు. "ఏమిటే అలా చూస్తావు? ఏం నేను ఆడదాన్నికాదా – నేను మనిషిని కానా, నాకేం కోరిక లుండవనుకున్నావా, ముప్పయి ఏడే ళ్ళకే ముసలిదాన్నయిపోయానంటే – యిప్పటికయినా జీవితాన్ననుభవించా లని నాకుండకం తప్పా? – ఏమిటి అలా చూస్తావు? అవునులే నీకెలా అర్థం అవుతుంది నా బాధ. పద్దెమిదేళ్ళకి పెళ్ళిచేసుకొని ఇరవై ఏళ్ళకి తల్లివయి, భర్త నీడని సుఖంగా బతుకుతున్న నీకు నాలాంటి ఆడదాని బాధ ఎలా అర్థం అవుతుందే! మంచిదే మీరంతా పతివ్రతలు. ఇలాంటి మాటలు మాటాడితే నన్ను చీదరించుకుంటారు. చీడపురుగులా చూస్తారు." ఆవేశంగా, కసిగా మొదలుపెట్టి, ఆవేదనతో గొంతు నిండగా మరి మాట్లాడలేక చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"సీతా!" అనునయంగా ఓదారుస్తూ బుజంమీద చెయ్యి వేశాను – దానిలో కరుడుకట్టిన దుఃఖం కన్నీళ్ళగా పారింది. దాన్నేమని ఓదార్చాలో కూడా అందుబట్టలేదు. దానిలో ఎంత దావాగ్ని రగలకపోతే ఇలాంటి దావాలనం బయటపడ్తుంది? దానికి ఓర్పు, సహనం ఎంత నశించకపోతే

యిలా దిగజారి మాటాడుతుంది ? తెల్సి తెల్సి యిలాంటి పనికి పాల్పడిం దంటే దాని వంటరి బతుకుపట్ల ఎంత భయం ఏర్పడిందో ?

దాన్ని ఓదార్చి, బుజ్జగించి అసలు సంగతి రాబట్టేసరికి పదిహేను నిమిషాలు పట్టింది.

అది చెప్పింది వింటూంటే —— ఈ దేశంలో ఈనాటికీ ఆడదాని కథ మారలేదన్నది స్పష్టపడిపోయింది. ఆడదాని అభ్యుదయం, పురోగమనం అంతా కాగితాలలో తప్ప కార్యాచరణలో శూన్యం అన్నది అర్ధమైంది, స్త్రీల హక్కులు ఓట్లు వేయడానికి మాత్రమేతప్ప స్త్రీల వ్యక్తిత్వానికి ఏమాత్రం విలువలేదు. ఈ నవ సమాజంలో - ఎంత చదివినా, ఎన్ని వూళ్ళేలినా స్త్రీకి సమాజంలో యిప్పటికీ రక్షణలేదు. స్త్రీల ప్రగతి అంతా వేష భాషలలో తప్ప వ్యక్తిత్వంలో మారలేదు. ఎంత సంపాదించినా పురుషుడితో సమాన స్థాయికి చేరడం అన్నది యిప్పటికీ గగన కుసుమంగానే మిగిలిందని, స్త్రీ పురుషులిద్దరూ చేసిన తప్పుకి స్త్రీనే సమాజం శిక్షించడం అన్న పాతకథ యింక మారదని, వంటరి స్త్రీ ఈ సమాజంలో నిర్భయంగా బతకలేదు అన్న నిజం ఎప్పటికీ అబద్ధంగా యింక మారదని - మారలేదని స్పష్టపడింది.-

"ఆఖరికి స్కూల్లో బంట్రోతుగాడి దగ్గరనించి నా బ్రతుకెంత లోకువయిపోయిందో తెలుసుటే - "అమ్మగారూ - పాపం వంటరిగా వున్నారు పడుకోడానికి రానా సాయంగా" అన్నాడే వేళాకోళంగా - కూటికి గతిలేని అక్షరంముక్క రాని ఆ వెధవకికూడా నా బతుకెంత లోకువయిందో చూడవే" ఏడ్చింది సీత.

"చెప్పుచ్చుకు కొట్టకపోయావా !" కోపంగా అన్నాను.

"కొట్టేనే - సాయం పడుకుంటానంటే - పుణ్యానికి పోతే పాపం ఎదురయిందట - అంటూ తప్పించుకునే తెలివి వాడికి లేదనుకున్నావా ? పైగా పచ్చకామెర్ల కళ్ళకి అంతా పచ్చగానే కనిపిస్తుందని అందరి హేళనలు గుసగుసలు మిగిలాయి. ఆ తెలుగు మేస్టరు, ఆ వెధవకి

యాభై ఏళ్ళున్నాయి, పెళ్ళాం పోయింది. వాడికి రెండో పెళ్ళికి కూడా నా అందం సరిపోలేదు. కాని వెకిలి మాటలాడడానికి, వెకిలి చేష్టలకి, చీకట్లో నా అందం కనబడదు. కనుక పడుకోవడానికి పనికి వస్తాను కాని రెంటో పెళ్ళికి కూడా పనికిరాలేదే నేను. వాడి వెర్రి మొర్రి వేషాలు చూసి పెళ్ళాడుదాం అన్నా ఒకరోజు అంతే మరి జోలికి రాలేదు. నెల తిరగ కుండా పాతికేళ్ళ దాన్ని పెళ్ళాడి తీసుకొచ్చాడు. ఆ డ్రాయింగు మాష్టరు గాడు ఓ రోజు చెయ్యిపట్టుకున్నాడే. చెంప పగలగొట్టాను. కోపం ఎలా తీర్చుకున్నాడో తెలుసా ? అందరితో నేను తన వెంటబడి ప్రాణం తీస్తు న్నానని ప్రచారం చేశాడు. ఈ వృద్ధ కన్యలు నలభై ఏళ్ళవరకు పెళ్ళి - పెటాకులు లేకుండా వుండడం వంటరిగా కనపడ్డ మగాళ్ళందరిని చంపు తారు అంటూ అందరూ వ్యాఖ్యలు, వేళాకోళాలు -" అది యింక చెప్ప లేకపోయింది గొంతు నిండుకోగా. వింటూన్న నా వళ్ళే వుడికిపోయింది. అది ఎలా భరించిందో ?

"ఏం చెప్పమంటావే, ఎన్నని చెప్పమంటావే. అడుగడుగునా ప్రతి క్షణం, ప్రతిరోజూ - యిలా చుట్టూ మగాళ్ళు రాబందుల్లా కాచుకొని వుంటూంటే ఎలా బతకనే, వంటరిగా, ఎన్నాళ్ళు పోరాడగలనే, ఎలా సహించనే" దీనంగా అంది.

"సీతా, అయితే కేవలం రక్షణ కోసమే నంటే యీ పెళ్ళి ?" జాలిగా అన్నాను.

"శాంతా యీ మాట, ఇదే రక్షణ కోసమే నిన్ను చేసుకుంటున్నా నని అతనంటే జన్మతా అతనికి కృతజ్ఞురాలినై అతనికి సేవ చేస్తూ అతని నీడన హాయిగా బ్రతికేదాన్ని - కాని.... హూఁ మగత్వం లేకపోయినా మగాడే కదా ఇతను. అందుకే ఈ స్థితిలో ఉండి నన్ను మోసం చెయ్యా లనుకున్నాడే, స్కూలులో, బయటా అందరూ నా గురించి అనే మాట లకి అతను జాలి చూపాడు - సానుభూతి చూపాడు. నా మీద జాలితో పెళ్ళాడుతానని చెప్పగానే కరిగిపోయి ఏడ్చేశానే - కన్నీళ్ళతో కృతజ్ఞ తతో పాదాలు అభిషేకం చేశాను. ఇన్నాళ్ళకు నా చీకటి జీవితంలో

వెన్నెల కురవబోతుందని మురిసిపోయాను. ఆ సంతోషంతో, ఆ ఆనం దంతో - చదువు, ఉద్యోగం, అందం అన్నీ వుండి నలభై యేళ్ళు పెళ్ళి కాకుండా నా కోసమే ఉన్నాడనుకున్నాను గానీ, అతని గురించి ఏమీ తెలుసుకో లేదు, అది తెలిసేసరికి సమయం మించిపోయింది. నల్గురికీ పెళ్ళని తెల్సింది. అంతా చెవులు కొరుక్కుని అసలు సంగతి నా చెవిని వేశారు. అతనికి అన్నాళ్ళు వండిపెట్టే తల్లి పోవడం, వంటరి బ్రతుకు పట్ల విరక్తి కలిగి, ఇల్లు, వాకిలి చూసుకోడానికి జీతం బత్తెం లేని పని మనిషిగా మాత్రం నన్ను పెళ్ళాడుతున్నాడన్న నిజం అర్థం అవగానే అతని దృష్టిలో ఎంత చుల్కన అయిందో నా బ్రతుకు అర్థం అయింది. వున్న సంగతి చెప్పి, సీతా నీకు నేను, నాకు నీవు తోడుగా బతుకుదాం అంటే ఎంత సంతోషంగా అంగీకరించేదాన్నే .... మోసం చెయ్యడం మగాడి రక్తంలోనే వుందే." కసిగా పళ్ళు కొరికి అంది.

"సంగతి తెలిశాక అయినా మానేయాల్సింది. ఇన్నాళ్ళు బ్రతికిన దానికి మరికొన్నాళ్ళు బ్రతకలేవుటే - పేరుకి ఈ పెళ్ళెందుకు?"

"ఉహూ - బతకలేను. నాకో తోడు కావాలి .... నీడ కావాలి .... కాని అతను నన్ను మోసం చేసినదానికి పగ సాధిస్తా .... సహ చర్యానికి తప్ప సహ జీవనానికి పనికిరాననుకున్న ఈ మగ వెధవ లందరి మీద నా కక్ష తీర్చుకుంటాను" పళ్ళు కొరికి కసిగా అంది,

"హూ - దానివల్ల నష్టపోయేది నీవుగాని మొగాళ్ళు కాదే, ఆడదాని బతుకు అరటి ఆకులాంటిదన్న సామెత మరిచిపోకు?"

సీత నిర్లక్ష్యంగా నవ్వింది, "ఇంతకంటె నష్టపోవడానికి ఇంకా ఈ జీవితంలో ఏం మిగిలిందే? ఎలాగో నష్టపోయాను, కనీసం కోరిక లయినా తీర్చుకుంటాను. ఎవరికోసం ఈ నీతి నియమాలు పాటించాలి?"

ఎవరికోసం కాదు. నీ కోసం - లేకపోతే నీ చుట్టూవున్న సంఘం నిన్ను బతకనీయదు."

"సంఘం - ఈ సంఘం నాకేం చేసిందే, కట్నాల బారినుంచి ఆడపిల్లలని రక్షించి పెళ్ళి చెయ్యలేని సంఘం — ఒంటరి ఆడదానికి కనీస రక్షణ కల్పించలేని యీ సంఘం ఏమయితే నాకేం, ఈ సమాజం ఒంటరి ఆడదానికి భద్రత ఇచ్చిందా — ఇంకా ఎవరో ఏదో అంటారని అనుకుంటారని భయపడ్తు నా సుఖాలని త్యాగం చేయమంటావా! ఈ బ్రతికిన నాలుగు రోజులూ హాయిగా బ్రతుకుతూనే...."

సీతా, నీ మచ్చ నీతోనే పోదే ఆ ముద్ర నీ పిల్లలమీద పడ్తుందే సంగతి మరిచిపోకు.

"అందుకే కదే యీ పెళ్ళి, యీ మొగుడు, యీ లైసెన్సు బిళ్ళలు నా పుట్టబోయే పిల్లకి తండ్రిని సంపాదించుకున్నాను - ఇంక ఫరవాలేదు. రోజు కొకడితో పడుకోవచ్చు...." వికటంగా నవ్వింది గట్టిగా.

గాభరాగా దాని నోరు మూశాను - "నోరు మూసుకోవే బాబూ, ఎవరన్నా వింటారు" భయంగా అన్నాను.

"విననీవే - విన్నాకానీ నీ పిచ్చిగాని నాలాంటి ఆడపిల్లల ఘోష చెవులు మూసుకు కూర్చున్న యీ సంఘాని కింత సులువుగా వినబడు తుందా...."

"ఇంక చాల్లేగాని నోరు మూసుకో. ఎవరన్నా వింటే నిజం అనుకోగలరు!" కసిరాను. సీత ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి, అబద్ధం అనుకుంటున్నావా నే చెప్పిందంతా - శాంతా, నా ఒక్కొక్క కన్నీటి బొట్టు సాక్షిగా నేను చెప్పిన ప్రతి అక్షరం నిజమే - చూద్దువుగాని నా మాట అబద్ధం కాదని - ఆడదంటే కేవలం ఆడది మాత్రమే గాదని, పగబడితే ఆడించేది అని కూడా అర్థం తెలియచెపుతానే ఈ వెధవలకి ఆ పాఠం నేర్పడానికి నేను సమిధనైనా ఫరవాలేదు, నేను వెలిగించిన మంట ఏ ఒక్క మగాడి గుండె కరగించినా, ఏ ఒక్క ఆడపిల్ల చీకటి బతుకులో దీపం వెలిగించినా నా జన్మకి సార్థకత లభిస్తుందే - ఆ రోజు

ఈ రోజునించే ఆరంభమే - ఆవేశంతో మొహం అంత ఎర్రబడిపోయింది సీతకి.

సీత వంక భయంగా చూశాను___

◆ ◆ ◆

మూడేళ్ళు గడిచాయి - ఈ మూడేళ్ళలో కనీసం ముప్పైసార్లన్నా వీళ్ళనోట వాళ్ళనోట సీత గురించి వింటూనే వున్నాను. విన్నప్పుడల్లా దాన్ని గురించి బాధ పడాలో, జాలి పడాలో అర్థం గాలేదు - రెండునెల్ల క్రితం సీతని మొగుడు వొదిలేశాడని ఎవరో అంటే నమ్మలేకపోయాను___

మూడ్రోజులక్రితం సీత ఆత్మహత్య వార్త అంది చకితురాలి నయ్యాను. ఆ రోజే సీత ఆఖరి ఉత్తరం అందింది

"శాంతా, నేను ఓడిపోయానే - ఆడది ఎప్పటికీ మగాడి చేతిలో ఆడేదేగాని ఆడించేది కాలేదని అర్థం చేసుకోడానికి చాలా రోజులే పట్టిందే। దానికి ఉదాహరణ మగతనం లేని నా మొగుడు కూడా నన్ను వదిలేయడమే। ఫరవాలేదులే. మూడేళ్ళలో ముప్పైయేళ్ళ జీవితాన్ని అనుభవించానులే।

ఒక్కటే విచారం। - ఇంత పతనం అయినా తల్లిని కావాలనే నా కోరిక తీరలేదు. నలుగురు నడిచినచోట గడ్డి మొలవదన్న సూక్తి మరిచి పోయాను। ఇంక ఈ బ్రతుక్కి అర్థం కనబడలేదు. అందుకే ఈ ఉత్తరం నీ కందే వేళకి చాలా దూరం వెళ్ళిపోయి వుంటాను - సీత.

కన్నీళ్ళు తుడుచుకున్నాను.

సీతలాంటి, ఆడవాళ్ళ కన్నీళ్ళు ఏరులై, వాగులై, వరదలై ఈ సృష్టిని ముంచెత్తాలి, అప్పుడు కొత్త సృష్టి జరగాలి। - అప్పటిగ్గాని ఆడ దాని కథ మారదు। అప్పటికైనా మారుతుందో లేదో।